# కాటుక కంటి నీరు

ఇవ్వాళ శ్యామల నా గదికొస్తానంది.

వస్తానంది గదా అని బయట కెక్కడికీ వెళ్లకుండా ఎదురు చూస్తూ కూర్చున్నాను.

శ్యామల మాట తప్పే మనిషి కాదు. వస్తానంటే వస్తుంది. ఇప్పటికి ఎన్నోసార్లు వచ్చింది. గత రెండేళ్ళుగా వారం పది రోజుల కొకసారయినా నా గది కొస్తూనే వుంది. కాని ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. బయల్దేరే ముందు ఏదయినా అవాంతరమొచ్చినా, బయల్దేరాక బస్సో రిక్షాయో దొరక్క పోయినా, పది నిమిషాలో పావుగంటో ఆలస్యంగా వచ్చేది గాని, ఇంత ఆలస్యం ఎప్పుడూ చెయ్యలేదు.

ఆరింటికల్లా వస్తానంది.

ఆరయింది, ఏడయింది, ఎనిమిది కావస్తోంది, కాని ఇంకా రాలేదు.

నాక్కాస్త చిరాగ్గా వుంది. ఆశాభంగమౌతుందేమోనని అనుమానంగా వుంది.

ఇవ్వాళ శలవు. రేపూ శలవే. అందుకే నాల్రోజులు ముందుగానే అనుకున్నాం ఇవ్వాళ కలవాలని.

శలవొచ్చిందంటే నేను సామాన్యంగా గదిలో వుండను. పగటిపూట అసలే వుండను. స్నేహితుల్తో తిరగటమో, ఏ సినిమాకో పోవటమో చేస్తుంటాను.

ఇవ్వాళ శ్యామలొస్తానందిగదా అని, తనొచ్చే సరికి బాగా 'ఫ్రెష్'గా వుందామని, పగలుకూడా బయటి కెక్కడికీ వెళ్ళలేదు. మధ్యాహ్నం భోంచేసి వచ్చాక రెండు మూడు గంటలు బాగా నిద్రపోయాను. లేచి అలా మెయిన్ రోడ్డు మీదికెళ్ళి, 'అశోకా'లో దూరి, కడుపు నిండా టిఫిన్ తిని, టీ తాగాను. ఫ్లాస్కులో రెండు కప్పులు స్పెషల్ కాఫీ పోయించాను. శ్యామల టీ తాగదు. వస్తూ వస్తూ దార్లో నాలుగయిదు రకాల స్వీట్లు తీసుకున్నాను. శ్యామలకి స్వీటంటే మహా యిష్టం. నాలుగు యాపిల్స్ కూడా మంచివి చూసి కొన్నాను. శ్యామలకి అవి కూడా చాలా యిష్టం.

గదికి తిరిగొచ్చి, నిద్ర బద్ధకమంతా వదిలేట్టుగా చన్నీళ్ళతో హాయిగా అరగంటసేపు స్నానం చేశాను. బట్టలు మార్చుకున్నాను. నా దగ్గర నాలుగయిదు రకాల విదేశీ పెర్ఫ్యూమ్స్ వున్నాయి. వాటిలో శ్యామల కిష్టమైనది తీసి వొంటిమీద స్ప్రే చేసుకున్నాను. బెడ్ షీట్ బాగా నలిగిపోయీ, మాసిపోయీ వుంది; అది తీసేసి, మంచిది, అందమైన షీట్ తీసి బెడ్ మీద పరిచాను. అన్నట్టు టీ తాగి వచ్చేప్పుడు మల్లెపూలు కూడా తెచ్చాను; పొట్లం విప్పి కొన్ని తీసి బెడ్మీద చల్లాను. మిగతావి అలాగే టేబుల్మీద వుంచాను – శ్యామల రాగానే పెట్టుకుంటుందని.

ఈ తతంగమంతా అయ్యే సరికి ఆరవనే అయింది; అప్పట్నించీ ఎదురుచూస్తూనే వున్నాను; శ్యామల ఇంకా రాలేదు.

★★★

నాకింకా పెళ్ళి కాలేదు.

నాలుగేళ్ళ నుంచీ ఈ వూళ్ళో ఉద్యోగం చేస్తున్నాను. ఎమ్మెస్సీ అయ్యాక అయిదారు మాసాలు ఖాళీగా వున్నానేమో, అంతే. తర్వాత ఈ వుద్యోగ మొచ్చింది.

ఫర్వాలేదు – మంచి వుద్యోగమే; అంతా కలిపి పన్నెండొందలు పైగా వస్తోంది; ఆ పై రెండొందలూ మటుకు బాంకులో వేసి, మిగతా వెయ్యీ నేను వాడుకుంటున్నాను. ఒక్కణ్ణే కావటం మూలాన ఎంత జల్సాగా వాడుకున్నా సరిపోతుంది.

నాలుగేళ్ళ క్రితం నుంచీ, నా చదువింకా పూర్తి కాక ముందు నుంచీ కూడా, నాకు పెళ్ళి సంబంధాలు చాలా వస్తున్నాయి; ఉద్యోగమొచ్చిందగ్గరనుంచీ మరీ ఎక్కువగా వస్తున్నాయి.

ఈ ఉద్యోగమే కాకుండా నాకు కొద్దిగా ఆస్తి కూడా వుంది. నాకు అన్నదమ్ములెవరూ లేరు. అంచేత మా వూళ్ళో వున్న పొలమూ, యిల్లూ నాకే వస్తాయి. నాకో చెల్లెలుంది గానీ, అయిదారేళ్ళ క్రితమే పెళ్ళయింది; అత్తారింటికి వెళ్ళిపోయింది.

నేను అంతో యింతో అందగాణ్ణేనని అంతా ఒప్పుకుంటారు.

ఈ రకంగా ఇన్ని అర్హత లుండటం చేత నాకు పిల్లనిస్తామనే వాళ్ళు చాలా మంది వున్నారు. మంచి కట్నం కూడా యిస్తామంటున్నారు.

నాకీ వుద్యోగ మిప్పించినాయనకే ఒక కూతురు ఉంది. ఒక్కతే కూతురు; ఎంత చచ్చులెక్క వేసినా లక్షన్నర ఆస్తి వుంది. అదంతా ఆ అమ్మాయికే. ఆయన

మాకు దూరపుచుట్టం కూడా. ఒక వేలు విడిస్తే మేనమామవుతాడు. లోగడ ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికయి మూడేళ్ళపాటు దేశసేవ చేసి (మధ్యంతర ఎన్నికలొచ్చి మధ్యలోనే వుద్యోగం వూడింది), ఆ తర్వాత మరో మూడు సార్లు ఎన్నికల్లో పోటీచేసి వోడిపోయాడు. అంచేత ఆయనకి రాజకీయంగా కాస్త పలుకుబడి వుంది. ఆ పలుకుబడితోనే ఎవర్నో మంత్రిని పట్టుకుని నాకీ వుద్యోగమిప్పించాడు.

ఉద్యోగమిప్పించటం బాగానే వుంది గాని, తన కూతుర్ని పెళ్ళిచేసుకోమనటమే నాకు నచ్చలేదు.

ఆ అమ్మాయికి మెల్లకన్నుంది; ఎనిమిదో తరగతి మూడుసార్లు తప్పింది. అంచేత ఆ అమ్మాయిని చేసుకోవటం నాకు ససేమిరా యిష్టం లేదు. ఆ అమ్మాయిని చేసుకుంటే ఆస్తి బాగా వస్తుందని మా అమ్మకీ, నాన్నకీ ఆశగా వుందిగాని, ఆ అమ్మాయిని మట్టుకు చేసుకోనని నేను కచ్చితంగా చెప్పేశాను. 'పోనీ అంతకంటే అందమయిన పిల్లలూ, చదువుకున్న పిల్లలూ చాలా మంది వున్నారు. వాళ్ళలో నీకిష్టమొచ్చిన అమ్మాయిని చేసుకో; నీ కిష్టమైతే కట్నం కాస్త తక్కువైనా సరే, మేమేమీ అభ్యంతరం చెప్పం...' అని మా వాళ్ళు నన్ను వేపుకు తింటున్నారు.

నాకేమో అసలిప్పట్లో పెళ్ళిచేసుకోటమే యిష్టం లేదు. మగాడు కనీసం ముప్ఫయ్యేళ్ళొచ్చే దాకా పెళ్ళి చేసుకోకూడదని నా ఉద్దేశం. ఇప్పట్నించీ ఈ బాదరబందీ ఎందుకు? నాలుగయిదేళ్ళు స్వేచ్ఛగా గడిపి, ఆ తర్వాత చూద్దాంలే అనుకుంటున్నాను. ఈ దేశంలో నీటికీ, కూటికీ, గుడ్డకీ కరువుందేమో గాని, ఆడపిల్లలకేం కరువు లేదు.

అరవయ్యేళ్ళొచ్చినవాడిక్కూడా కాళ్ళు కడిగి కన్యాదానం చేసేవాళ్ళు చాలా మంది వున్నారు.

మూడో తరగతి ముమ్మారు తప్పినవాడికి ముప్ఫయి వేలు కట్నం యిచ్చే వాళ్ళున్నారు.

ముక్కూ మొహం లేని వాడికి రంభలాంటి పిల్లనిచ్చే వాళ్ళున్నారు.

అలాంటప్పుడు - చదువుండీ, మంచి వుద్యోగముండీ, అందముండీ, ఆస్తి వుండీ అన్నీ వున్నవాడికి నాకేమిటి తొందర? నలభయ్యేళ్ళొచ్చినా నాకు పెళ్ళి కాదన్న భయంలేదు. జీవితంలో చూడాల్సినవీ, అనుభవించాల్సినవీ అనేకమున్నాయి. పెళ్ళి ఎప్పుడయినా చేసుకోవచ్చు. కాని ఈ వయసు మళ్ళీ రాదు. ఇవన్నీ ఆలోచించుకున్న

మీదటే ఇప్పుడే పెళ్ళి చేసుకోటం, పిల్లల్ని కనటం, మరెవరికో మన మీద అధికారాలన్నీ అప్పగించటం, బరువులూ, బాధ్యతలూ నెత్తిన వేసుకోటం – ఇవన్నీ తెలివితక్కువ పనులని నిర్ణయించుకున్నాను.

అందుకే ఏదో ఒక మిషమీద ఇన్నాళ్ళూ పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాను.

శ్యామలకి కూడా ఇంకా పెళ్ళి కాలేదు. నేను చేరిన మరో ఏడాదికి శ్యామల మా ఆఫీసులో చేరింది. బియస్సీ ఒక ఏడాది చదివి ఆ తర్వాత చదివే స్తోమత లేక, మధ్యలో మానేసి, టైపూ, షార్టుహాండూ నేర్చుకుని, రెండు మూడు చోట్ల రెండొందలకీ, మూడొందలకీ పని చేసి, చివరికీ ఆఫీసులో స్టెనోగా చేరింది.

ఇక్కడ ఆరొందలదాకా ఇస్తున్నారు. తెలివైందనీ, పని బాగా చేస్తుందనీ శ్యామలకి ఆఫీసులో మంచి పేరుంది.

శ్యామల పని చేసేది మా సెక్షన్లో కాదు.

అందువల్ల ఆమెతో పరిచయం కావడానికే ఆర్నెలు పట్టింది.

నేను తల్చుకుంటే ఇంకా త్వరగానే శ్యామల పరిచయాన్ని, స్నేహాన్నీ సంపాదించగలిగేవాణ్ణి. ఆడపిల్లల్తో ఎలా పరిచయాలు పెంచుకోవాలో నాకు తెలుసు. నేనంత విచ్చలవిడిగా తిరిగే రకం కాదు గాని, శ్యామలకంటే ముందే అయిదారుగురు అమ్మాయిల్తో నాకు 'స్నేహం' వుంది.

శ్యామలని చూసీ చూడగానే, ఆ అమ్మాయి నన్నంతగా ఆకర్షించలేదు. అందుకే కొన్నాళ్ళు నేనామెను గురించి పట్టించుకోలేదు.

ఒకనాడు ఆఫీసులో పనెక్కువుండి గంట ఆలస్యంగా బయటికొచ్చాను. ఆరు దాటింది. త్వరగా గదికెళ్ళి స్నానం చేసి ఏ సినిమాకి పోదామా, సినిమా మొదలెట్టకముందే వెళ్ళగలనా అని ఆలోచిస్తూ, స్కూటర్ కాస్త వేగంగానే పోనిస్తున్నాను.

దార్లో బస్ స్టాప్‌లో నిలబడి వుంది శ్యామల. రోజూ తను "అక్కడే బస్సెక్కుతుంది. తనతోపాటు పనిచేసే మరో లేడీ టైపిస్టు ఇవ్వాళ రాలేదు కాబోలు, శ్యామల ఒక్కతే వుంది. బస్సింకా రాలేదు కాబోలు, ఇంకా అక్కడే నిలబడి వుంది బస్సుకోసం ఎదురుచూస్తూ. అక్కడింకా చాలా మంది వున్నారు. నేనెప్పుడూ బస్సులో వెళ్ళకపోయినా, బస్సెక్కేవాళ్ళ అవస్థలు రోజూ చూస్తూనే వున్నాను.

శ్యామలని చూడగానే స్కూటర్ ఆపాను. అప్పటిదాకా మా పరిచయం "హలో" అంటే "హలో" అన్నంతవరకే. "రండి. స్కూటర్ మీద వెళ్దాం. నేను డ్రాప్ చేస్తాను" అన్నాను.

మారు మాట్లాడకుండా వచ్చి స్కూటరు ఎక్కి కూర్చుంది. "ఇవ్వాళ మరీ దారుణంగా వుందండీ! గంట సేపట్నించీ నిలబడ్డాను. ఒక్క బస్సు కూడా దొరకలేదు... మీరు లిఫ్ట్ ఇవ్వకపోతే ఇంకెంతసేపు నిలబడాల్సి వచ్చేదో...!" అంది స్కూటర్ నడుస్తుండగా,

''మీకేమీ అభ్యంతరం లేకపోతే కాఫీ తాగి పోదాం...'' అన్నాను, దార్లో ఒక మంచి హోటల్ దగ్గర స్కూటర్ ఆపుతూ,

శ్యామల అభ్యంతరం చెప్పలేదు. ఇద్దరమూ రెస్టారెంట్లోకి వెళ్ళి కూర్చున్నాం. అక్కడ కూర్చున్నంతసేపూ తన్ను గురించిన వివరాలన్నీ చెప్పింది శ్యామల, నా గురించి అడిగి తెలుసుకుంది. అతిగా సిగ్గు పడకుండా, అనవసరంగా భయపడకుండా, డాంబికాలూ, దర్పాలూ లేకుండా, కృత్రిమమైన నవ్వులూ, నయగారాలూ, నటనలూ లేకుండా చనువుగా, స్వేచ్ఛగా, నిర్భయంగా, నిర్మలంగా, తియ్యగా మాట్లాడింది.

ఆ తర్వాత ఆమెతో పరిచయం స్నేహంగా మారడానికి అట్టే కాలం పట్టలేదు. శ్యామల నా గదికి వచ్చేటంతగా మా స్నేహం పెరగడానికి మాత్రం, మరికొంత కాలం పట్టింది. నా గదికి రమ్మని మొట్టమొదటిసారి నేను శ్యామలని అడిగినప్పుడు – ఆమె అదిరిపడలేదు. అరవలేదు. అలాంటిదాన్ని కాదని నీతులు వల్లించలేదు. భారతస్త్రీ గురించి ఉపన్యాసాలివ్వలేదు – కాని కొద్దిగా సిగ్గుపడింది. నవ్వి వూరుకుంది. అవుననీ, కాదనీ అప్పుడేమీ చెప్పలేదు. నేను అప్పటికి వూరుకున్నాను. మరోసారి నేనడిగినప్పుడు మాత్రం సరేనంది.

మాయలూ, మర్మాలూ, దొంగవేషాలూ, అబద్ధాలూ లేని శ్యామల చొరవా, చనువూ, నిర్భయత్వమూ నాకు నచ్చాయి. మనసే కాదు, ఆమె అందం కూడా సామాన్యమైంది కాదని – ఆమె నా గదికి రావటం ప్రారంభించాక తెలిసింది.

శ్యామల అప్పుడే దాదాపు రెండేళ్ళ నుంచీ నా గదికొస్తోంది. ఆఫీసు లేనప్పుడు మధ్యాహ్నమో, సాయంత్రమో సినిమాకనో, స్నేహితురాళ్ళ దగ్గరకనో చెప్పి నా దగ్గరకొచ్చి, మూడు నాలుగు గంటలు ఉండి వెళ్తుంది. ఒకటి రెండుసార్లు పగలంతా

నా దగ్గరే వుంది. మరోసారి ఒక స్నేహితురాలి పెళ్ళికి పొరుగూరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, రెండు రోజులు పూర్తిగా నా గదిలోనే వుంది.

శ్యామలకి నేను లేనిపోని ఆశలేవీ చూపించలేదు. నిన్ను ప్రేమిస్తున్నానని గాని, నువ్వులేందే బ్రతకలేనని గాని, నిన్నే పెళ్ళి చేసుకుంటానని గాని నేనెన్నడూ పొరపాటున కూడా అన్లేదు. అలాంటి ఆశలు శ్యామలకి కూడా లేవు. నా గురించీ, నా అభిప్రాయాల గురించీ ఆమెకి చాలా సార్లు విపులంగా చెప్పాను. శ్యామల కూడా నా దగ్గర ఏమీ దాయలేదు.

నువ్వే నా సర్వస్వమనీ, నిన్ను తప్ప మరో మగాడి వంక కన్నెత్తి చూడననీ, నువ్వు లేందే నేను బ్రతకలేననీ, నా జీవితమే నీ కంకితమనీ – ఇలాంటి నాన్సెన్స్ శ్యామల నా దగ్గర ఎన్నడూ మాట్లాడలేదు. చదువుకునే రోజుల్లో ఒకతనితో పరిచయముండేదట. అతన్ని ప్రేమించిందట. అతను కూడా శ్యామలను ప్రేమించాడట. "నిన్నే పెళ్ళి చేసుకుంటాను" అని కూడా అన్నాడట. కాని ఆ మాట అన్న ఆర్నెల్లకే అతను మరో అమ్మాయిని చేసుకుని, ఆ వూర్నించి మకాం కూడా ఎత్తేసి మరెక్కడికో పోయాడట. "ఆ దెబ్బనించి తేరుకోటానికి చాలా కాలంపట్టింది. ఆ తర్వాత చాలా మంది నన్ను పెళ్ళి చేసుకుంటామన్నారు. అవీ అబద్ధాలే! అందుకే నేనెవర్నీ నమ్మలేదు. వయసులో వున్న ఆడదానిమీద, అందుబాటులో వున్న ఆడదానిమీద మగాడికుండే ఆసక్తి ఒక్కటే. అదేమిటో నాకు బాగా తెలుసు"... అంటుంది శ్యామల.

మొదట ప్రేమించినతనితో కూడా శ్యామలకి శారీరకమైన సంబంధం ఉండేదిట. ఆ మాట తనే చెప్పింది. "అతను, ఆ తర్వాత నువ్వు... అంతే మరెవరూ లేరు..." అంది శ్యామల ఒకసారి. నేనామాట నమ్మాను. శ్యామల మాట తప్పదు, అబద్ధాలాడదు.

★ ★ ★

ఎన్నడూ మాట తప్పని శ్యామల ఇవ్వాళ తప్పిందేమోనన్న అనుమానం నాలో కలుగుతుండగా, తొమ్మిదిన్నర కావస్తుండగా అప్పుడొచ్చింది. వచ్చీ రావటమే నాకో ముద్దిచ్చి, ఆలస్యానికి 'సారీ' చెప్పింది.

రోజూ సాదాసీదాగా వుండే శ్యామల, ఆ రోజు ఎందుకో అతిగా అలంకరించుకుంది. రోజూ ఏ పల్చటి వాయిల్ చీరో కట్టుకునేది. ఆ రోజు పట్టుచీర

కట్టుకుంది. తనవో, మరెవరివోగాని, నాలుగయిదు రకాల నగలెట్టుకుంది. తలలో తట్టెడు పూలెట్టుకుంది. ఆఖరికి బొట్టూ, కాటుకా కూడా రోజూలా వున్నట్టు లేవు.

శ్యామలది అలంకరణ అంతగా అవసరంలేని అందం. అనవసరమైన ఆడంబరాలూ, అలంకరణలూ ఆమెకిష్టముండవు కూడా. అలాంటిదాన్ని ఆ వేషంలో చూడడం నాకేమిటో వింతగానూ, కొంత ఎబ్బెట్టుగానూ అనిపించింది. ఏమిటిదని నేనడిగేలోగా తనే చెప్పింది.

"ఇవ్వాళ నన్ను చూడ్డానికి ఎవరో వచ్చారు. పెళ్ళిచూపులు. అందుకే ఈ గంగిరెద్దు వేషం, అందుకే ఇంత ఆలస్యం. వాళ్ళివ్వాళే వస్తారని తెలీదు" అంది.

నేను ఆశ్చర్యపోయాను. శ్యామలకి దాదాపు పాతికేళ్లుంటాయి; ఆమె పెళ్ళికి ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నట్టూ, ఎన్నో సంబంధాలు వచ్చిపోయినట్టూ నాకు తెలుసు. అయినా ఆ వేళే పెళ్ళి చూపులు జరిగాయనేసరికి నాకేమిటోగా అనిపించింది. ఆమెతో 'సరదా'గా గడపటమే తప్ప పెళ్ళి చేసుకుందామన్న ఉద్దేశం నాకెప్పుడూ లేదు. అయినా ఆమెకి పెళ్ళిచూపులు జరిగాయనేసరికి, నాకేమిటో ఇబ్బందిగా అనిపించింది.

అప్పటికే ఆలస్యమైపోయింది; ఆ ఆలోచనలన్నీ బలవంతాన అణుచుకోడానికి ప్రయత్నిస్తూ ఆమెను దగ్గరకు తీసుకున్నాను; ఎప్పుడెప్పుడా అని ఎంతో సేపట్నించి ఎదురుచూస్తున్నానేమో, నేను కాస్త తొందరపడ్డాను.

"కొంచెమాగు... చీర విప్పేస్తాను... నలిగిపోతుంది... నా కున్నదిదొక్కటే పట్టుచీర... ఇంకా ఎన్నిసార్లు కట్టాలో ఏమో!" అంది శ్యామల.

నేను తెల్లబోయి చూశాను.

"అవును... ఇవ్వాళ్టి పెళ్లిచూపులు వట్టిచూపులే.... నేను వాళ్ళకి నచ్చానట గాని కట్నం చాలదట. వాళ్ళు చెప్పేశారు. అంతకంటే కట్నం మా నాన్న ఇవ్వలేడు. నా తర్వాత పెళ్ళి కావలసిన వాళ్ళింకా ముగ్గురున్నారు - చెల్లెళ్ళు. మా తమ్ముడికింకా వుద్యోగం దొరకలేదు. అసలు నేనిప్పుడు పెళ్ళి చేసుకుని నా దారిన నేను పోతే... ఇంట్లో గడవటం కూడా కష్టమే. అందుకే నేను కూడా ఈ సంబంధం తప్పిపోవటమే మంచిదనుకుంటున్నాను. కాని ఎప్పుడో సారి తప్పదుగా? మళ్ళీ పెళ్ళిచూపులు. మళ్ళా ఈ వేషమంతా వెయ్యటం... మళ్ళా విప్పటం... మళ్లా వెయ్యటం..." అంటూ శ్యామల నవ్వుతోంది.

కాని నిజానికది నవ్వు కాదు... నాకు తెలుసు... ఆ గుండెల్లో ఎంత బాధ వుందో నేనేమీ అన్లేకపోయాను. అప్పుడయినా – 'నీకేం ఫర్వాలేదు.. నేనున్నాను.. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను..' – అన్లేక పోయాను... ఎలా అంటాను? నా కులం; నా ఆస్తి, నా గౌరవం; నాకొచ్చే కట్నం. ఇవన్నీ ఎలా వదులుకోను?

శ్యామల నవ్వటం ఆపేసింది. కాస్సేపు ఎవరమూ ఏమీ మాట్లాడలేదు.

ఆమె రెండు కళ్ళల్లోనూ నీరు నిండి, కాటుకతో కలిసి చిక్కబడి, మెల్లగా జారి, ఆ సాయంత్రం నేను పరిచిన తెల్లటి దుప్పటి మీద నల్లగా బొట్లు బొట్లుగా పడ్డాయి.

○

*(విపుల - మాసపత్రిక - ఏప్రిల్ - 1980)*